వేతన సంఘాలెందుకు..

నలభై లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులకు గొప్ప ఊరట! 40 శాతం వేతనాల పెంపును సిఫార్సు చేస్తూ... జస్టిస్ బి.ఎన్.శ్రీకృష్ణ నేతృత్వంలోని ఆరో వేతన సంఘం తన నివేదికను సమర్పించింది. ప్రైవేటు రంగంలోనిఉద్యోగులు భారీగా జీతాలు అందుకుంటున్న తరుణంలో... వేతన సంఘం సిఫార్సులు.. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల మధ్య జీతాల్లో వ్యత్యాసాలను తగ్గించేందుకు దోహదం చేయనుంది.

జీవనవ్యయానికి, ఆదాయానికి మధ్య అగాధం నిరంతరం పెరుగుతూ ఉంటుంది. ఆదాయ, వ్యయాల మధ్య వ్యత్యాసం అధికమైతే... జీవన ప్రమాణాలు పడిపోతాయి. ఈ పరిస్థితిల్లో ఉద్యోగులను ఆదుకునేందుకు ప్రభుత్వం వేతన సంఘాన్ని ఏర్పాటుచేస్తుంది. సాధారణంగా ప్రతి ఐదేళ్లకోసారి నియమిస్తుంది. సంఘం సిఫార్సులను పరిగణనలోకి తీసుకొని, జీతాల పెంపును అమలు చేస్తుంది. ఇప్పటివరకూ ఆరు వేతన సంఘాలు ఏర్పాటయ్యాయి.

ఒకటి నుంచి నాలుగు వరకూ..

మొదటి వేతన సంఘం 1946లో ఏర్పాటైంది. ఇది ఒక ఏడాదిలోపే తన నివేదికను సమర్పించింది. రెండో వేతన సంఘాన్ని 1957లో ఏర్పాటు చేయగా... తన సిఫార్సులను రెండేళ్లకు నివేదించింది. దీని అమలుతో ఖజానాపై రూ.39.6 కోట్లమేర భారం పడింది. మూడో వేతన సంఘాన్ని 1970 ఏప్రిల్‌లో నియమించారు. ఇది మార్చి 1973లో తన నివేదికను సమర్పించింది. దీని అమలు వ్యయం రూ.144 కోట్లు. నాలుగో వేతన సంఘం 1983 జూన్‌లో ఏర్పాటైంది. ఈ సంఘం నాలుగేళ్లలో మూడు విడతలుగా తన నివేదికను ఇచ్చింది. రూ.1282 కోట్ల వ్యయం అయింది.

ఐదో వేతన సంఘం:

ఐదో వేతన సంఘం 1994లో ఏర్పాటైంది. 1997లో ఈ వేతన సంఘం సిఫార్సులు, అమలులో ఎదురైన ఆర్థిక ఇబ్బందులు చర్చనీయాంశమయ్యాయి. నాడు తన పరిధిలోని 33 లక్షల మంది కేంద్ర ప్రభుత్యోద్యోగులకు కేంద్రం జీతాలు పెంచింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కూడా పెంచాలని సూచించింది. ఆ సిఫార్సుల అమలుకు ముందు రూ.21,885 కోట్లుగా ఉన్న కేంద్ర వేతన బిల్లు... రూ.43వేల కోట్లకు పెరిగింది. అదే సమయంలో రాష్ట్రాలపై భారం రూ. 52వేల కోట్ల నుంచి రూ.90 వేల కోట్లకు పెరిగింది. జీతాల పెంపుదలతోపాటు ప్రభుత్వ సిబ్బందిలో 30 శాతం తగ్గింపును, మూడున్నర లక్షల ఉద్యోగాల భర్తీ నిలుపుదలను ఐదో వేతన సంఘం సిఫార్సు చేసింది.

ఆరో వేతన సంఘం:

ఆరో వేతన సంఘాన్ని కేంద్రం 2006లో నియమించింది. ఛైర్మన్ జస్టిస్ బి.ఎన్.శ్రీకృష్ణ; సభ్యులు రవీంద్ర ధొలాకియా, జె.ఎస్.మాధుర్. మార్చి 24, 2008న తన నివేదికను ఆర్థిక మంత్రి చిదంబరానికి సమర్పించింది. దేశంలోని 40 లక్షలకుపైగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు సగటున 40 శాతం జీతాలను పెంచాలని సిఫార్సు చేసింది. సవరించిన వేతనాలు 2006 జనవరి ఒకటో తేదీ నుంచి అమలు చేయాల్సి ఉంటుంది. ఆరో వేతన సంఘం సిఫార్సులను యథాతథంగా అమలు చేస్తే... ఈ ఏడాది ఖజానాపై అదనపు వ్యయభారం రూ.12,561 కోట్లని అంచనా! రెండేళ్ల బకాయిల నిమిత్తం అంచెలవారీగా మరో 18 వేల కోట్ల దాకా ఖర్చుకానుంది.

రక్షణ సిబ్బంది జీతాలు రెట్టింపు:

వేతనాలు, గ్రేడుల్లో రక్షణ బలగాల ఉద్యోగులు, పౌర ఉద్యోగులతో సమానంగా ఉండాలి. ఈ సిఫార్సు ద్వారా రక్షణ సిబ్బంది జీతాలు రెండింతలు పెరుగుతాయి. త్రివిధ దళాల అధిపతులకు కేబినెట్ కార్యదర్శితో సమానంగా రూ.90 వేల జీతం చెల్లించాలి. ఇప్పటివరకూ రక్షణ సిబ్బందికి ఎక్కువ వేతనాలు ఉండేవి కావు. ఇప్పుడు పౌర ఉద్యోగులతో సమానంగా వారి వేతనాలు పెంచాలని సిఫార్సు చేయడం విశేషం. మహిళలు, వికలాంగుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని కూడా ఆరో వేతన సంఘం సూచించింది. రక్షణ బలగాల సిబ్బందిని కేంద్ర పారామిలిటరీ బలగాల్లోకి బదలాయించడం, కరవు భత్యం విలీనం లాంటి కొన్ని సిఫార్సుల వల్ల రూ.4586 కోట్లు ఆదా అవుతుందని వేతన సంఘం అంచనా వేసింది. వినియోగదారుల ధరల సూచీని ఎప్పుడు వీలైతే అప్పుడు సవరించాలని, ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక సూచీని ఏర్పాటు చేయాలని వేతన సంఘం సిఫార్సు చేసింది. సిటీ కాంపెన్‌సేటరీ అలవెన్సును రవాణా భత్యంలో విలీనం చేయాలని, దీన్ని నాలుగింతలు పెంచాలని సూచించింది.

విమర్శలు.. విశ్లేషణ:

40 శాతం పెంపు అంటే.. భారీ పెంపుదలే అయినా.. విమర్శలు కూడా ఎక్కువగానే వచ్చాయి. ఈ నివేదిక పైస్థాయి వారికే లాభం చేకూరుస్తుందని, ఐఏఎస్ మార్కు ఉందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇంతటి పెంపును భారత్ భరించలేదని సీపీఐ నేత గురుదాస్ దాస్‌గుప్తా అభిప్రాయపడ్డారు. ప్రవేటు, ప్రభుత్వ రంగాల్లో వేతనాల్లో వ్యత్యాసం భారీగా ఉంది. సామాజిక అసంతృప్తులు తలెత్తకుండా ఈ అగాధాన్ని తగ్గించడం, వృత్తి నైపుణ్యాలను ప్రోత్సహించేవిధంగా ఆరోవేతన సంఘం సిఫార్సులు చేసింది. నైపుణ్యం ప్రాతిపాదిక ఎంపిక చేసిన వారిని తాత్కాలిక పద్ధతిన నియమించడం, అత్యధిక ప్రతిభ కనబరిచినవారికి ఇప్పుడిస్తున్న 2.5 శాతం ప్రోత్సాహకాన్ని మరో శాతం పెంచడం, విద్యాభత్యాన్ని రూ.50 నుంచి రూ.1000లకు పెంచమని సిఫార్సు చేయడం ఇందులో

భాగమే!!

ముఖ్య సిఫార్సులివి:

- వేతనాలు సగటున 40 శాతం పెంచాలి.
- భత్యాలను రెట్టింపు చేయాలి.
- కనీస ప్రారంభ వేతనం రూ.6,600(ఇప్పటివరకూ రూ.4,860) ఉండాలి.
- యువ శాస్త్రవేత్తలు, ప్రత్యేక పోస్టుల్లో ఉన్నవారికి మార్కెట్‌ను బట్టి ప్రతిఫలం ఇవ్వాలి.
- అత్యధిక నైపుణ్యం అవసరమైన, ఎంపిక చేసిన పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిన నియామకాలు చేపట్టాలి.
- ఉద్యోగుల పదవీ విరమణకు ప్రస్తుతమున్న 60 ఏళ్ల వయసును కొనసాగించాలి.
- శాస్త్రవేత్తలు, వైద్య నిపుణులకు వయోపరిమితి మరో రెండేళ్లు ఎక్కువగా ఉండాలి.